# మా ఆవిడ 'నకిలీ'సు

-ఇలపావులూరి మురళీమోహనరావు

ఈ మధ్య నగరంలో గొలుసు దొంగల దాడి ఎక్కువైంది. అంటే చెయిన్ స్నాచర్సన్న మాట. రోడ్ల వెంట వెళ్తున్న ఆడవారి మెళ్ళలోని మంగళసూత్రాలను, గొలుసులను రెప్పపాటులో తెంచుకుని మోటార్ సైకిళ్ల మీద పరారౌతున్నారు. పౌరులు ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, కంఠాలకు అధికంగా ఆభరణాలను అలంకరించ రాదని, అలంకరించినా అవి ఎవరికీ కనిపించకుండా భుజాల నిండుగా పమిట చెంగు కప్పుకోవాలని, దొంగలు గొలుసు చోరీ చెయ్యగానే సమీపంలోని పోలీసు స్టేషన్లో రిపోర్టు ఇవ్వాలని కమిషనర్ మొదలు కానిస్టేబుల్ వరకూ జీపుల్లో తిరుగుతూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

మెడలో ఎలాంటి గొలుసులు ధరించినా ధరించక పోయినా మంగళసూత్రం ప్రతి మహిళకు తప్పదాయె! రోమియోల బారి నుంచి తప్పించుకోవాలన్నా మంగళసూత్రాలే సగటు మహిళకు రక్షణ కవచం కదా!

ఏ ఛానెల్లో వార్తలు విన్నా, ఏ దినపత్రిక చూసినా రోజూ ఐదారు చెయిన్ స్నాచింగ్ వార్తలు తప్పనిసరిగా దర్శనమిస్తున్నాయి. 'బస్సు దిగి ఇంటికొస్తున్న మహిళ మెడలోని మంగళసూత్రం అపహరణ' 'షాపు నుంచి ఇంటికొస్తున్న స్త్రీ గొలుసు చోరీ', 'దారి కాచి మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళల గొలుసు లాక్కున్న దుండగులు' లాంటి కాప్షన్స్ కనిపించడం మామూలైంది.

నాకు తెలియకుండా మా ఆవిడ చాలాకాలంగా దాచుకున్న కొంత డబ్బు, మూడో కంటికి తెలియకుండా చిట్టీలు వేసి పాడుకున్న డబ్బుతో కలిపి ఈ మధ్యనే ఒక నాంతాడు చేయించుకుంది. 'ఎంతైంది?' అని ఎన్నిసార్లడిగినా 'మీకెందుకు?' అని ప్రశ్నించేది. సరే... మెడలో ఇంత బంగారం అమరింది కదాని నేనూ ఏమీ మాట్లాడలేదు.

నాంతాడు చేయించుకున్న రెండు రోజులకే ఇలాంటి వార్తలు వస్తుండడంతో కంటి మీద కునుకు పడితే ఒట్టు. ఆ చిన్న వస్తువు లేనప్పుడు రాత్రి తొమ్మిదిన్నరకల్లా గుండెల మీద చేతులు వేసుకుని గురకలు పెడుతూ నిద్రపోయే వాళ్ళం. నాంతాడు చేయించుకున్న ప్పటి నుంచి రాత్రి పన్నెండైనా నిద్ర పడితే ఒట్టు! చేయించుకోక చేయించుకోక జన్మకో శివరాత్రి అన్నట్టు ఒక్క సువర్ణాభరణం చేయించుకుంటే ఈ గొలుసు దొంగల భయం ఇప్పుడే రావాలా?

ఇద్దరం కలిసి రోడ్డు మీద వెళ్తుండగా ఏ స్కూటర్ ఎదురొచ్చినా రైలు పట్టాలు తప్పి ప్లాట్‌ఫామ్ మీది కొస్తున్నదా అన్నంత భయంతో పూర్తిగా రోడ్డు దిగుతున్నాం. ఒక్కోసారి మా నీడలను చూసి మేమే కెవ్వుమని అరిచే వాళ్ళం.

గత నాలుగైదు రోజులలో మా కాలనీలో పదిమంది గొలుసులు చోరీ అయ్యాయి. మోటార్ సైకిల్ మీదనో, స్కూటర్ మీదనో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులలో వెనుక కూర్చున్న వాడు రెప్పపాటు కాలంలో గొలుసు తెంచగానే వంద మైళ్ళ స్పీడుతో ముందు కూర్చున్నవాడు బండి నడిపే వాడు. బాధితులు షాక్ నుంచి తేరుకునే లోగా వాళ్ళు మెరుపు వేగంతో మాయమైపోయే వాళ్ళు.

తమకున్న నగలు, చీరెలు ప్రదర్శించడమంటే ఆడవారికి భలే మోజు. తాము కొన్నది స్టీలు పళ్ళెమైనా సరే, తెలిసిన వారందరికీ చూపిస్తే కానీ వారికి నిద్ర పట్టదు. అందువలన రోడ్డు మీదకెళ్ళిన ప్రతిసారీ మెడకప్పుకుని వెళ్ళడం వారికి కంటక ప్రాయంగా తయారైంది. "ఇంతలోనే ఎవడొస్తాడులే" అని ఒక్క క్షణం ఏమరుపాటుగా ఉండడం, ఆ క్షణమే వాళ్ళ పాలిట శాపం కావడం మామూలైంది.

దొంగతనం జరగ్గానే పోలీసులకు ఫోన్

చెయ్యడం, పది నిముషాలలో సైరన్లు మోగించుకుంటూ వారు రావడం, బాధితుల్ని సవాలక్ష ప్రశ్నలు వేసి వివరాలు రాసుకోవడం, ఆ తరువాత బాధితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చెయ్యడం సర్వసాధారణమై పోయింది.

"రోడ్ నెంబర్ వన్‌లో ఫలానా ఆవిడ గొలుసు ఎవరో లాక్కుపోయారట" అని ఎవరో చెప్పడం, వెంటనే జనం అక్కడకు పరుగు దియ్యటం, ఇంతలోనే "రోడ్ నెంబర్ సిక్స్‌లో శాస్త్రిగారి భార్య మంగళసూత్రాలు తెంపుకు పోయారట" అని మరో వార్త రావడం, మళ్ళీ ఈ జనమంతా అటు పరిగెత్తడం, ఎప్పుడో దోపిడీకి గురైన వారు ఆనందంగా కొత్త బాధితుల వద్దకు వెళ్ళి తమ అనుభవాలు వివరించడం, కొత్తగా పోగొట్టుకున్న వారి సొమ్ముకంటే తమది ఒక్క మిల్లీగ్రాము తక్కువున్నా తమ అదృష్టానికి సంతోషించడం నిత్య తంతుగా మారింది.

ఆ రోజు మా పాలిట అత్యంత దుర్దినం. నేనూ మా ఆవిడ ఎదురింట్లో కొత్తగా అద్దెకు దిగిన వారితో రెండు నిముషాలు మాట్లాడి రోడ్డు దాటి మా ఇంటికొస్తున్నాం. మెరుపు వేగంతో మా ముందు నుంచి ఒక మోటార్ సైకిల్ రివ్వున దూసుకెళ్ళడం, వెనుక కూర్చున్న వ్యక్తి మా ఆవిడ మెడలోని నాంతాడును తెంచుకుపోవడం లిప్తపాటులో జరిగిపోయాయి. అందరూ చూస్తుండగానే జరిగిన ఈ దారుణానికి దిగ్భ్రాంతి చెందాం. మా ఆవిడ కెవ్వున కేక పెట్టింది. అందరూ కేకలు పెట్టారు. 'పట్టుకోండి... పట్టుకోండి' అని అరిచారు. వంద కిలోమీటర్ల స్పీడుతో వెళ్తున్న ఆ బండిని పట్టుకోవడం ఎవరి తరం? అందునా దొంగలని తెలిసిన తరువాత!?.

అన్ని వీధుల్లోని వారు ఆఘమేఘాల మీద పరిగెత్తుకొచ్చారు. వారి వారి అనుభవాలను చెప్పడం ఆరంభించారు. ఆ గొలుసు దొంగ ఏ కత్తితోనో, బ్లేడుతోనో గాయపరచనందుకు సంతోషం వ్యక్తం చేశారు. అరక్షణంలో మెడలోని గొలుసును తెంచుకుపోగలిగిన వాడి చోరకళా కౌశలాన్ని అభినందించారు మరికొందరు.

పోలీసులకు ఫోన్ చెయ్యమని సలహా ఇచ్చారు. 'ఏం ఉపయోగం?' అని పెదవి విరిచారు కొందరు. వారూ వీరూ అంతా ఒకటేనని నిట్టూర్చారు ఇంకొందరు.

మా ఆవిడ శోకాలు పెడుతున్నది. 'ఏడిస్తే ఏం లాభం? పోయిన సొమ్ము తిరిగొస్తుందా?" అని ఓదార్చాడొకాయన. "ఇది మరీ బాగుంది. తిరిగి రాకపోతే మాత్రం ఏడవకుండా ఉండగలమా? మన వాళ్ళెవరైనా చనిపోతే శోకాలు పెట్టమా? శోకాలు పెడితే వాళ్ళు బ్రతికొస్తారా అని ఊరుకుంటామా?" అన్నాడు ఒక పెద్దాయన.

అందరూ పైకి ఏడుపు ముఖాలు పెట్టినా లోపల మాత్రం చ్చాలా ఆనందంగా ఉందనేది సత్యం. ఎన్నో సంవత్సరాలు కడుపు కట్టుకుని దాచుకున్న డబ్బుతో చేయించుకున్న నగ క్షణంలో దొంగల పాలవడంతో నాకు కడుపు రగిలి పోయింది. పోలీసులకు ఫోన్ చేశాను. పది నిముషాల తరువాత పాత కాలం నాటి మోపెడ్ మీద ఇద్దరు కానిస్టేబుళ్లొచ్చారు.

"ఎక్కడ దొంగలు? ఏరీ?" అడిగాడొక పీ.సి.

''వాళ్ళిక్కడెందుకుంటారు? డ్యూటీ చేయడానికి మరో చోటికి పోయుంటారు'' అన్నాడొకాయన పరిహాసంగా.

"అయ్యో... ఇంతమంది ఉన్నారు. ఇద్దరిని పట్టుకోలేక పోయారా?" అన్నాడు పిసీ.

''వారు దొంగలండీ. వారి దగ్గర ఆయుధాలుంటాయి"

"దొంగలూ మనుషులే. పిడికిలి బిగించి ముక్కు మీద గుద్దితే నక్షత్రాలు కనపడి నేలకరుచుకుంటారు".

"ఆ పనేదో మీరే చెయ్యండి"

"ఇంతకూ విక్టిమ్ ఎవరు?"

"మా ఆవిడేనండీ?" చెప్పాను.

"ఐసీ. కంప్లెయింటిస్తున్నారా?"

"ఇస్తామండీ"

"గుడ్... మీలో ఎవరైనా సాక్ష్యమిస్తారా?" అందరి వంకా చూసి అడిగాడు పోలీసు.

అంతే....తుపాకీ పేలితే పిట్టలు పారిపోయినట్టు అందరూ మాయమై పోయారు. నేనూ, మా ఆవిడ, ఇద్దరు పోలీసులు మిగిలాం.

"ఇదండీ వరస. ఇన్సిడెంటును అందరూ చూస్తారు. చూసింది చెప్పడానికి ఒక్కరూ ముందుకు రారు. ఇక మేము దొంగలను ఎలా పట్టుకోగలం?" కోపంగా అన్నాడు పోలీసు.

"అంటే... మీరు దొంగల్ని పట్టుకోరా?" నా నాంతాడు మీద ఆశ వదులుకోవలసిందేనా?"



ఏడుస్తూ అన్నది మా ఆవిడ.

"అబ్బెబ్బె.... పట్టుకోకుండా ఎలా ఉంటాం? మాట వరసకన్నాను. దొంగలు ఈ ప్రపంచంలో ఎక్కడ దాకున్నా పట్టుకుంటాం. నదులు ఎన్ని వంకలు తిరిగినా సముద్రంలో కలవక తప్పదన్నట్టు ఈ దొంగ వెధవలు ఎక్కడ తిరిగినా చివరకు పోలీసు స్టేషన్‌కు రాక తప్పదు. పదండి లోపలికెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు పోలీసు.

ఇంట్లో కొచ్చి కూర్చున్నాం. ఒక పోలీసు పెన్ను, ఒక చిత్తు కాగితం తీసుకొన్నాడు. మరొకాయన ప్రశ్నలడగడం మొదలెట్టాడు.

"దొంగలిద్దరూ ఎలా ఉన్నారు?"

"ఇద్దరూ కుర్రాళ్ళండీ"

"కుర్రాళ్ళన్న విషయం చెప్పక్కర్లేదు. కుర్రాళ్ళు కాకపోతే ముసలోళ్ళు ఇలాంటి పని చెయ్యగలరా? వయసెంతుండొచ్చు?"

"పాతికేళ్ళలోపు"

"ఆ విషయం చెప్పక్కర్లేదు. ఇలాంటి ఖతర్‌నాక్ పనులు పాతికేళ్ళలోపు వాళ్ళు కాక తొంభై ఏళ్ళ పైబడిన వారు చేస్తారా? ఇద్దరూ ఏ రంగులో ఉన్నారు?"

నేనూ, మా ఆవిడ ఏమీ మాట్లాడలేదు.

"ఏమిటి మాట్లాడరు?"

"ఆ విషయం చెప్పాలా అక్కర్లేదా అని..."

"చెప్పాలి... చెప్పాలి... రంగు చాలా ముఖ్యం"

"సరిగ్గా గమనించలేదండీ"

"బండి నెంబరేంటి?"

"చూడలేదండీ"

"అరె! దొంగలు దాడి చేసినప్పుడు కనీసం బండి నెంబరైనా చూడాలి కదా"

"ఆ షాక్‌లో మేము గమనించలేదండీ"

"మీకేమైనా గాయాలయ్యాయా?"

"లేదండీ"

"ఏ మేం పోయాయి?"

"నాంతాడొకటేనండి"

"దాని బరువెంత?"

"ఆరు తులాలండీ, చేంతాడులా ఉంటుంది"

"చూడమ్మా...అంత కచ్చితంగా చెప్పొద్దు. కనీసం రెండు తులాలైనా ఎక్కువ చెప్పండి. ఎందుకైనా మంచిది" సలహా ఇచ్చాడు పోలీసు నవ్వుతూ.

"వద్దండీ. అక్రమంగా వచ్చే పాడు సొమ్ము మాకొద్దు" ఏడుపు గొంతుతో అన్నది మా ఆవిడ.

"మీ నిజాయితీని అభినందిస్తున్నాను. ఆ నాంతాడుతో ఏదైనా ఫొటో తీయించు కున్నారా? ఉంటే ఇవ్వండి. దొంగలు దొరికినప్పుడు గుర్తించడానికి వీలౌతుంది.

"లేదండీ. నిన్ననే చేయించుకున్నాను దాన్ని. ఇరవై నాలుగు గంటలు కూడా గడవలేదు" ఘొల్లుమంది మా ఆవిడ.

"దారుణం. దొంగ గాడిదకొడుకులకు అలాంటి సెంటిమెంట్లేవీ వుండవు. మేము రిపోర్టు రాసుకుంటాం. మీరీలోపల కొంచెం చాయ్ పెట్టండి. తరువాత దీని మీద సంతకాలు పెట్టాలి".

పది నిముషాల తరువాత లేచారు పోలీసులు.

"సార్... నా గొలుసు నాకు దక్కుతుందంటారా?" రాళ్ళు కూడా కరిగి పోయేంత దీనంగా అడిగింది మా ఆవిడ.

"మా ప్రయత్నాలు మేము చేస్తాం. ఈలోగా మీర త్వరపడి పెద్దపెద్దవారితో రికమెండేషన్ చేయించకండి" అన్నారు పోలీసులు.

"మాకు తెలిసిన అంతపెద్ద వారెవరూ లేరులెండి. మీరే దిక్కు" అన్నాను దీనంగా

"డోన్ట్ వర్రీ. ధైర్యంగా ఉండండి. దొంగలు దొరకగానే కబురు చేస్తాం" టీ తాగి వెళ్ళిపోయారిద్దరూ.

వాళ్ళు వెళ్ళగానే తలుపు వేశాను. "బుద్ధి తక్కువ పని చేశావు. వాళ్ళు చెప్పినట్లు రెండు తులాలు ఎక్కువ చెప్పాల్సింది" అన్నాను.

"ఆ మాత్రం తెలివి నాకు లేదనుకోవద్దు. రెండు తులాలు ఎక్కువే చెప్పాను. దాని అసలు బరువు నాలుగు తులాలే..." అన్నది మా ఆవిడ నవ్వుతూ.

'ఔరా' అని నోరు తెరిచాను.

సంవత్సరం గడిచిపోయింది. దాదాపు పాతిక సార్లు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగాను. ఫలితం శూన్యం. దొంగలు ఇంకా దొరకలేదనే సమాధానం.

"దోపిడీ దొంగల ఆటకట్టు"

"నగర శివార్లలో ఛైన్ స్నాచర్స్ అరెస్టు"

"గొలుసు దొంగల ముఠా పట్టివేత"

ఇలాంటి వార్తలు ప్రతిరోజూ పేపర్లలో వస్తున్నాయి. ఈ వార్తలు చదివి మేము పోలీసు స్టేషన్లకి పరిగెత్తడం, తీరా మేము వెళ్ళగానే 'ఆ దొంగలలో మీ గొలుసును కాజేసిన వాళ్ళు లేరు' అని వాళ్ళు చెప్పడం మామూలైంది.

ఒకరోజు పోలీసు స్టేషన్నుంచి ఫోనొచ్చింది.

"మీ కాలనీలో దొంగతనాలు చేసిన వారు కొంతమంది దొరికారు. మీరొచ్చి ఎవరినైనా గుర్తుపట్టగలరేమో చూడండి" చెప్పాడు ఎస్ఐ.

వెంటనే ఇద్దరం స్టేషనుకెళ్ళాం.

"రండి... రండి.. దొంగ వెధవలు ఎంతకాలం దాక్కుంటారు? అరుగో... వీరే మీ కాలనీని పంచుకున్న దొంగలు. వీరి ముఠాలో మరో నలుగురిని ఇప్పుడే యల్బీనగర్ స్టేషన్‌కు తరలించాం. వీరిలో ఎవరైనా ఉన్నారా?" అడిగాడు ఎస్ఐ

వేమనలు ఆ దొంగల ముఖాలు చూసిందెప్పుడు? చూసినా సంవత్సరం తరువాత గుర్తుంటాయా?

మా భావాలను అర్థం చేసుకున్నాడల్లే ఉంది."వెంటనే యల్బీనగర్ స్టేషనుకెళ్ళండి. మిగిలిన వాళ్ళు అక్కడున్నారు" చెప్పాడు ఎస్ఐ

యల్బీనగర్ స్టేషనుకెళ్ళాం "వాళ్ళను ఇంటరాగేట్ చేసి వనస్థలిపురం స్టేషన్ కప్పగించాం. వెంటనే అక్కడికి వెళ్ళండి" చెప్పాడు ఎస్ఐ.

నీరసమొచ్చింది మాకు. చేసేదేమీ లేక వనస్థలిపురం స్టేషన్ కెళ్ళాం. "ఆ దొంగ గాడిదలను లాకప్‌లో పడేశాం. ఏయ్ ఫోర్ ట్వంటీ... వీరికి ఆ దొంగ నాయాళ్ళను చూపించు" ఆదేశించాడు ఇన్స్‌పెక్టర్.

ఒక కానిస్టేబుల్ మమ్మల్ని లాకప్ రూం వద్దకు తీసుకెళ్ళాడు. నలుగురు వ్యక్తులను చూపించాడు. పచ్చి రక్తాన్ని పరమాన్నంలా జుర్రుకుంటారా అన్నట్టున్న వారిని చూడగానే గుండె ఠారుమంది.

"చెప్పండి. వాళ్ళలో ఎవరు మీ గొలుసు కాజేసిన వాడు? వాడి ప్రాణాలు తోడేసైనా మీ సొమ్ములు మీ కిప్పిస్తా" కంచు కంఠంతో అన్నాడు సిఐ

"అంతా చీకట్లో జరిగిందండీ. పైగా జరిగి సంవత్సరం దాటింది. మాకేం గుర్తుంటుంది" అన్నాను.

## విలువైన 'సాహిత్య కబుర్లు"

### సేకరణ: డాక్టర్ ద్వా.నా. శాస్త్రి

వెల: రూ. 50-00

ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషర్స్

వారి అన్ని బ్రాంచీలు)

ద్వా.నా. శాస్త్రి సాహితీరంగానికి సుపరిచితులే. ఎన్నో సంవత్సరాలుగా సేకరించిన అపూర్వమైన, విలువైన సాహిత్య సంగతుల్ని "సాహిత్య కబుర్లు"గా పుస్తక రూపంలోకి తెచ్చారు. వందేళ్ల నాటి విశేషాలు కూడా వున్నాయి. సభా విశేషాలు, చమత్కారాలు, హాస్యోక్తులు, ఎక్కడా దొరకని కవితలు, సంఘటనలు, మేల్పలుకులు.... ఇలా ఎన్నో సాహితీ విశేషాలకు నిధి ఈ "సాహిత్య కబుర్లు". సేకరణే గదా అని కొందరు పెదవి విరిస్తే అది అసమంజసమే అవుతుంది. పరిశోధనలో సేకరణ కూడా ఒక భాగమని గుర్తించాలి. ఒకనాటి సాహిత్య వాతావరణం, సాహితీ వ్యక్తుల స్వభావాలు బాగా తెలుస్తాయి. మారుమూల పుస్తకాల నుంచి, ఇప్పుడు దొరకని పత్రికల నుంచి సేకరించి మనముందు 'సాహిత్య విందు'గా ఉంచారు. ప్రాచీన ఆధునిక సాహిత్యానికి సంబంధించిన కబుర్లు కూడా ఉన్నాయి. కాబట్టి అంతా చదవవచ్చు. "సాహిత్య కబుర్లు" అనే పేరు బాగుండ లేదనే వారు. "సాహిత్యమొర్మరాలు" (తాపీ వారిది) గుర్తు తెచ్చుకోవాలి. నిజంగానే ఇది విశేషమైన గ్రంథం.

**–తిరునగరి శ్రీనివాస్**

"వాట్! మీ కళ్ళముందే మీ గొలుసు కాజేసిన వాడిని మీరే గుర్తించలేక పోతే ఇక మేమేం గుర్తించగలం? మీలాంటి బాధ్యత గలిగిన పౌరులు కూడా పోలీసులకు సహకరించకపోతే ఎలా?" విసుక్కున్నాడు సిఐ.

ఏం మాట్లాడాలో తెలియలేదు.

"పోనీ.. వాళ్ళలో ఎవడో ఒకడిని చూపించి ఇదే అని చెప్పండి. వాడి చేత రక్తం కక్కించైనా నిజం చెప్పిస్తాను. వాడి దగ్గర దొరికన వాటిలో ఏదో ఒక గొలుసు మీకిప్పిస్తాను" అన్నాడు సిఐ.

"అమ్మో... అలా ఎవడో ఒకడిని చూపిస్తే రేపు వాడు బయట కొచ్చి మా రక్తం తాగుతాడేమో" అన్నాను భయంగా

"వెధవ ప్రాణాలకు భయపడితే ఎలాగండీ?"

"ఆ వెధవ ప్రాణాలనేవి బొందిలో ఉంటే ఎప్పటికైనా మరో నెక్లెస్ చేయించుకోవచ్చు".

"సరే... మీ ఇష్టం. అయితే మళ్ళీ కబురు చేస్తాం" కూల్‌గా చెప్పాడు సిఐ.

మరో సంవత్సరం గడిచింది. కబురూ లేదు. కాకరకాయా లేదు.

ఇదిలా ఉండగా మా యింటికి రెండు ఇళ్ళు అవతల ఒక ఛోటా రాజకీయ నాయకుడు అద్దెకు దిగాడు. ఒక రోజు రాత్రి వాళ్ళింట్లో దొంగలు పడి ఒక టేప్ రికార్డర్, పాతిక క్యాసెట్లు, రెండు బంగారు గాజులు దోచుకెళ్ళారు. రాజకీయ నాయకుడు కమిషనర్‌కు ఫోన్ చేశాడు. ఆఘమేఘాల మీద పది మంది పోలీసులొచ్చారు. దొంగలను వెంటనే పట్టుకోకపోతే నక్సలైట్ ఏరియాకు బదిలీ చేయిస్తానని హెచ్చరించాడు రాజకీయనాయకుడు.

మర్నాడు సాయంకాలానికి దొంగలు దొరకడం, టేప్ రికార్డర్, క్యాసెట్లు, గాజులతో సహా రాజకీయ నాయకుడికి అప్పగించడం అయిపోయింది.

"పోలీసులకు దొంగలు బాగా తెలుసు. పలుకుబడిలేని వారిగురించి వారు పట్టించుకోరు. బెదిరించే వారికి భయపడతారు" అన్నారందరూ. నిజాయితీకి, సహనానికి విలువలేదని అర్థమైంది.

ఆ మర్నాడు డీజీపికి క్లోజ్ ఫ్రెండయిన నా ఫ్రెండ్‌కు విషయం చెప్పాను. ఆ సాయంకాలమే పోలీస్టేషన్నుంచి మాకు ఫోనొచ్చింది.

ఇద్దరం స్టేషనుకెళ్ళాం. కొన్ని గొలుసులు చూపించాడు ఎస్ఐ. వాటిలో మా గొలుసు లాంటిది ఒకటి ఉన్నది. మా సంతోషానికి పట్టపగ్గాలు లేవు "ఇదే" అని చెప్పింది మా ఆవిడ.

"ఇందాక ఇద్దరు దొంగలు దొరికారు. వాళ్ళ తోలు వలిచాం. మీ వీధిలో గొలుసులు కాజేసింది వాళ్ళేనట. ఈ కాగితాల మీద సంతకం చేయండి. రేపు కోర్టుకొచ్చి మీ సొత్తు తీసుకోండి" చెప్పాడు సిఐ. మర్నాడు కోర్టుకెళ్ళి మా గొలుసు తెచ్చుకున్నాం.

"నాలుగు తులాల నెక్లెస్ పోయినా ఆరు తులాలది వచ్చింది. నిజానికిది మనది కాదు. అదే డిజైన్. ఏదొకటి. బంగారం అయితే దక్కింది" తృప్తిగా అన్నది మా ఆవిడ.

తరువాత గొలుసుకు పుస్తెలు గుచ్చుతుండగా ఒక లింకు తెగిపోయింది. కంసాలి వద్దకు తీసుకెళ్ళాను.

"ఇనుప గొలుసు మెడలో వేసుకోవడం అరిష్టం. అరవై సంవత్సరాల అనుభవంతో చెబుతున్నా. ఇనుము మీద బంగారపు పూత. వంద రూపాయలు కూడా చెయ్యదు" చెప్పాడు కంసాలి.

తల తిరిగింది నాకు. వెంటనే స్టేషన్‌కు పరిగెత్తాను "తీసుకునేటప్పుడు అది కచ్చితంగా మీదేనని చెప్పారు. కోర్టులో సాక్ష్యం కూడా చెప్పారు. మీ వస్తువు మీకు తెలియకుండా ఎలా ఉంటుంది? మీ కేసు ఫైలు మూసేశాం. చూస్తుంటే మీరేదో నకిలీ గొలుసు తయారు చేయించి మా దగ్గర్నుంచి మరో నెక్లెస్ కొట్టెయ్యడానికి ప్లాన్ వేసినట్టున్నారు. మీ మీద ఫోర్ ట్వంటీ కేసు పెట్టాల్సి ఉంటుంది" కళ్ళెర్ర చేశాడు సిఐ

కాళ్ళు చేతులు చల్లబడ్డాయి నాకు. పై నుంచి వచ్చిన వత్తిడికి తట్టుకోలేక నకిలీ (గొలు)సు మాకిచ్చారని అర్థమైంది. ఇంటికొచ్చి మా ఆవిడకు విషయం చెప్పాను.

ఇంకేముంది? లబోదిబో....

■